క్లుప్తంగా

12 నామినేషన్లు దాఖలు

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం 12 నామినేషన్లు దాఖలు అయ్యాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ అహ్మద్ బాషా, తెలుగుదేశం నుంచి షేక్ ముక్రం బాషా, షేక్ మొహమ్మద్ తూర్పు నియోజకవర్గ ఆర్వో కీర్తి చేకూరికు నామినేషన్ పత్రాలు అందజేశారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ నుంచి విడదల రజిని తరఫున కోటేశ్వరరావు గుండ్రాటి, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సలికినీడి కిరణ్ కుమార్, పాలకాయల శ్రీనివాసరావు, స్ఫూర్తి విడదల, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున నూనె పవన్ తేజా నాయుడు, నవోదయం పార్టీ తరఫున కృష్ణ కిషోర్ ఆళ్ల, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున జాన్ బాబు రాచకొండ(రెండు సెట్లు), నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున సయ్యద్ రిజ్వాన పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మీకి నామినేషన్ పత్రాలు అందజేశారు.

ప్రత్తిపాడులో తొమ్మిది నామినేషన్లు దాఖలు

ప్రత్తిపాడు: నామినేషన్ల దాఖలు గడువు మరో 24 గంటలు మాత్రమే ఉండటంతో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. ఆరవ రోజైన బుధవారం తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బలసాని కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొరివి వినయ్‌కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా తాడికొండ మండలం పాములపాడుకు చెందిన కొరివి రజనీకాంత్ నామినేషన్లు దాఖలు చేశారు. కాగా కిరణ్‌కుమార్ తరఫున రెండవ సెట్‌ను ప్రపోజర్ మెట్టు వెంకటప్పారెడ్డి, వైఎస్సార్ సీపీ నుంచి బలసాని కెజియా స్రవంతి తరఫున ప్రపోజర్ వేలూరి లక్ష్మారెడ్డి, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా బుర్రి రాంబాబు రెండవ సెట్‌ను, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సీహెచ్ కృష్ణంరాజు, బెజ్జం నాగరాజు రెండవ సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ మేరకు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్‌కు అందజేశారు.

నేడు షర్మిల గుంటూరు రాక

లక్ష్మీపురం: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గుంటూరు రానున్నట్లు ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గురువారం సాయంత్రం 6 గంటలకు గుంటూరు నగరంలోని శారదా కాలనీ, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో ఆమె పర్యటించనున్నట్లు చెప్పారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



తెనాలిరూరల్: కొలకలూరు శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కువ మంది చదువరులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకునే విధంగా, గ్రంథాలయాన్ని ఎక్కువ మంది పాఠకులు వినియోగించుకునే విధంగా చేయాలని ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయాధికారి కడియాల సుజాతను ఆదేశించారు. ఇక్కడ అందుతున్న గ్రంథాలయ సేవల గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మే 7వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

తెనాలిలో ఆకస్మిక తనిఖీ

తెనాలి: గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. లైబ్రరీలోని పోటీ పరీక్షల పుస్తకాలతో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు తగిన కృషి చేయాలని ఆదేశించారు. వీరితో గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

పెదకాకానిలో వలంటీర్ల రాజీనామా

పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకాని లూథర్‌గిరి కాలనీ, యువజన నగర్‌కు చెందిన వలంటీర్లు వర్రే చంద్ర, జంగా రాజేష్, మండే పవన్, అమిరే చినబాబు, సంకూరు సంతోష్, అమిరె జస్వంత్ ప్రకాష్, ఆత్మకూరు అశోక్, గాలి నవీన్‌కుమార్, బండ్లమూడి పద్మావతి బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని స్వచ్ఛందంగా తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావుకు అందజేశారు. వలంటీర్లపై టీడీపీ నాయకుల కక్ష సాధింపు చర్యలు చేపట్టడం, టెర్రరిస్టులతో పోల్చడం, వేధింపులకు గురిచేయడం, సామాజిక ఫించన్లు కూడా ఇవ్వకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. సచివాలయం 5 పరిధిలో పనిచేస్తున్న 9 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు.

పేదల కలలు జగనన్నతోనే సాకారం

- పెత్తందారుల కలలు నిజం చేయాలనేది చంద్రబాబు తాపత్రయం
- అమరావతి కల భగ్నం అయిందనే జగనన్నపై ఉక్రోషం
- రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- నగరంలోని 29వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ కార్యక్రమం
- మంత్రితోపాటు ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్



ప్రచారంలో అభివాదం చేస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరి



చిన్నారితో మంత్రి రజిని

పట్నంబజారు: పేదల కలలు సాకారం కావాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరంలోని 29వ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన 'మనతో మన రజినమ్మ' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ చంద్రబాబు పెత్తందారుల కలలను సాకారం చేయడానికే అమరావతి రాజధాని ప్లాన్ చేశారని, ఆ కలను భగ్నం చేశారనే పెత్తందారులంతా ఒకటయ్యారని తెలిపారు. జగనన్న రాష్ట్రంలో పేదలందరి కలలను సాకారం చేయడానికి కృషి చేస్తున్నారని చెప్పారు.

రాష్ట్రంలో అన్ని ప్రధాన నగరాల్లో గణనీయమైన అభివృద్ధి

ఓ పక్క గ్రామాలను స్వయంసమృద్ధిగా చేయడంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాలన్నింటిని కూడా అభివృద్ధి చేశారని మంత్రి రజిని చెప్పారు. విజయవాడలో బెంజి సర్కిల్ ఫ్లై ఓవర్, కృష్ణానది కరకట్ట నిర్మాణం, అంబేడ్కర్ స్మృతివనం ద్వారా నగరానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చారన్నారు. మంగళగిరి- తాడేపల్లి మున్సిపాలిటీలను కలిపి మెగా కార్పొరేషన్‌ఏర్పాటుచేశారని, తద్వారా గుంటూరు, విజయవాడల మధ్య హైవేకు రెండు వైపులా మొత్తం అభివృద్ధి చెందుతోందన్నారు. విశాఖపట్నంను రాష్ట్రానికే తలమానికంగా అభివృద్ధి చేస్తున్నారని, ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఫ్లై ఓవర్ నిర్మాణం చేశారని చెప్పారు. గుంటూరు నగరంలో ప్రధాన రహదారులన్నీ నిర్మాణం చేశామని, గాంధీ పార్కు, శిల్పారామంలను అభివృద్ధి చేసి ప్రారంభించామని చెప్పారు. గుంటూరు వెస్ట్ నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నియోజకవర్గంలో మున్నెన్నడూ జరగనంత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

టీడీపీకి భంగపాటు తప్పదు

తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికల్లోనూ భంగపాటు తప్పదని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ తెలిపారు. గుంటూరు పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయబోతున్నామని చెప్పారు. జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. చేసిన మేలును ప్రజలు ఎవరూ మరిచిపోరని చెప్పారు. డివిజన్ పరిధిలోని మహబూబ్‌నగర్, శ్రీరామ్ నగర్, వెంకటకృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషణ్ , వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ షేక్ సైదా, రామిరెడ్డి, వెంకటరెడ్డి, రమేష్, మజీద్, ఈశ్వరరావు, మున్నా, మాధవరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో హెల్త్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ చిన్న పిల్లల వార్డు, కాన్పుల వార్డులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ఆస్పత్రుల్లో చిన్న పిల్లల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్ఐడీ పని తీరును ఆయన పరిశీలించారు. ఆస్పత్రి నుంచి చిన్న పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా తీసుకుని వెళ్లే వారిపై నిఘా పటిష్టం చేస్తున్న విధానాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. తల్లి, బిడ్డకు ఏర్పాటు చేసిన ట్యాగ్ పని తీరును కూడా ఆయన పరిశీలించారు. కాన్పుల వార్డులో బాలింతలతో కమిషనర్ మాట్లాడారు. సాధారణ ఆపరేషన్లు జరుగుతున్నాయా, శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయా అనే విషయాలపై బాలింతల తల్లులతో మాట్లాడారు. తల్లి,బిడ్డ క్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. 24 గంటలపాటు తల్లి,బిడ్డ పర్యవేక్షణ చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలోని పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. పసిబిడ్డలకు ట్యాగ్స్ అమర్చేప్రక్రియ నర్సింగ్ సిబ్బంది చేయాలని కమిషనర్ సూచించారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పు అయిన తరువాత చిన్నపిల్లల వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నవజాత శిశువులకు ఈ ట్యాగ్‌లు అమర్చాలని సూచించినట్లు వెల్లడించారు. తల్లికి అమర్చే ట్యాగ్ లు లాక్ సిస్టం లేదని, అది అత్యవసరమని కమీషనర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. ఈ మార్పుకు అంగీకరించి వెంటనే అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించినట్లు సూపరింటెండెంట్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి ఉన్నారు.

చిన్నోడు భలే చురుకైనోడు..

- జాతీయ ఫెన్సింగ్‌లో రాణిస్తున్నాడు
- పది పరీక్షల్లో 559 మార్కులతో మెరిసిన నిహాల్



పోటీల్లో తలపడుతున్న నిహాల్



559 మార్కులు సాధించడంతో స్కూల్ యాజమాన్యం నుంచి అభినందనలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): ప్రోత్సాహం, అవకాశాలు ఉండాలేగాని ఎన్ని రంగాల్లోనైనా రాణించవచ్చని నిరూపిస్తున్నాడు నగరానికి చెందిన చిన్నోడు దొప్పలపూడి డానియేల్ నిహాల్(15). ఇటీవల ప్రకటించిన 10వ తరగతి పరీక్షల్లో 559 మార్కులు సాధించాడు. అంతేకాదు ఫెన్సింగ్ క్రీడలోనూ జాతీయ స్థాయిలో పోటీపడుతున్నాడు. ఉన్న సమయాన్ని మొబైల్స్‌కు, టీవీకి కాకుండా స్కూల్ నుంచి రాగానే తన కిష్టమైన ఫెన్సింగ్ క్రీడకు కేటాయిస్తూ దాని ఫలాలను అందుకుంటున్నాడు.

తల్లిదండ్రుల నుంచే..

నిహాల్ తండ్రి మహేంద్రకుమార్ అంతర్జాతీయ అథ్లెట్. తల్లి అరుణ కూడా జాతీయ స్థాయి అథ్లెట్. ఉన్నత విద్యావంతులు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శామ్యూల్ సుజన్ జాతీయ స్థాయి హ్యామర్ త్రోయర్. చిన్నవాడే నిహాల్. ఉన్న సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో వారికి బాగా తెలుసు. మొబైల్స్ ఎంత వాడుకోవాలి, ఎలా వాడుకోవాలో పిల్లలకి చక్కగా వివరించారు. అంతా షెడ్యూల్ ప్రకారం వెళ్లాలని, అప్పుడప్పుడు కొన్ని వెసులుబాటులు కూడా పిల్లల విషయంలో కల్పిస్తారు. అందుకే పిల్లలిద్దరికీ తొలి గురువులు తల్లిదండ్రులే.

నిహాల్ విజయాలు..

2019లో మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన అండర్-10 చైల్డ్ కప్ జాతీయ ఫెన్సింగ్ పోటీలకు హాజరయ్యాడు. 2021లో కాకానాడలో నిర్వహించిన అండర్- 14 ఓపెన్ స్టేట్ మీట్‌లో కాంస్యం, 2022లో కాకినాడలో నిర్వహించిన అండర్- 14 రాష్ట్ర పోటీల్లో కాంస్యంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. 2023లో అండర్-17 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో టీం ఈవెంట్‌లో రజతం, అదే ఏడాది రాష్ట్ర ఓపెన్ మీట్‌లో కాంస్యం సాధించిన గుజరాత్‌లో నిర్వహించిన నేషనల్స్‌లో పాల్గొన్నాడు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలి



విద్యార్థులతో రాయపాటి శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు భావి తరాలకు మార్గదర్శకులుగా ఉండాలని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో బుధవారం 2023-25 బ్యాచ్ విద్యార్థులకు స్వాగతం కార్యక్రమంతో పాటు 2022-24 బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్య అభ్యసిస్తున్న భావి ఉపాధ్యాయులు బోధనా వృత్తిలో నైపుణ్యవంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం యూనివర్సిటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య, కోశాధికారి వి.కుప్పుస్వామి, విశ్రాంత ప్రొఫెసర్ వజ్జా రంగారావు, ప్రిన్సిపాల్ మోటూరి రవికుమార్ పాల్గొన్నారు.

డోలు, నాదస్వరంతో వినూత్న నృత్యం

పలువురికి యువ కళారత్న పురస్కారాలతో సత్కారం



నృత్యం చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 14వ అంతర్జాతీయ నృత్య దినోత్సవం-2024 బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కూచిపూడి నృత్య సంప్రదాయంలో ప్రప్రథమంగా డోలు, నాదస్వరంతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ ఖాజావెంకట సుబ్రహ్మణ్యం దర్శకత్వం నిర్వహించారు. గాత్రం జె.భువనేశ్వరి, టీఎం కృష్ణారావు, నాదస్వరం ఎంవీ సుబ్బరామయ్య, క్యాసియో తిన్నలూరి హరిబాబు, డోలుపై ఎం.హరిబాబు సహకారం అందించారు. అనంతరం పచ్చల నాగమహిత, తాళ్లూరి ధరణి, బీసా బత్తిని పూజితశ్రీలను యువ కళారత్న పురస్కారంతో సన్మానించారు. పఠకమూరి సుప్రియ, చేనేంద్ర గ్గాయత్రి, ఎర్రగుంట హేమజోషికచౌదల నాట్యం ప్రేక్షకులను అలరించాయి. మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు గరికపాటి శిరీష పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

డీఎంహెచ్ఓ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి, పక్కన సుబ్బరాయణం

గుంటూరు మెడికల్: దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్ఓ కె.విజయలక్ష్మి తెలిఆపరు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 'ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని ఉధృతం చేద్దాం' అనే నినాదంతో వరల్డ్ మలేరియా డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దోమల నియంత్రణలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా సాయంత్రం 5 గంటలకు తలుపులు, కిటికీలు మూసివేయాలన్నారు. వేప పొగ వేయుట, మెష్ డోర్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా కట్టడి చేయవచ్చని పేర్కొన్నారు. దోమకాటు నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలని చెప్పారు. దోమల నియంత్రణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. తరచూగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దోమలు పెగరకుండా కొబ్బరి చిప్పలు, టీ కప్స్, టైర్స్, పూల కుండీలలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని చెప్పారు. గురువారం ఉగయం 8.30 గంటలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రపంచ మలేరియా దినోత్సవంపై ఆరోగ్య శాఖ సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ రాజు నాయక్, గణేష్, జయప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎండలకు జాగ్రత్తలు తీసుకోవాలి

కొద్దిరోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎండలు ముఖ్యంగా వడగాడ్పులు తీవ్రంగా వీస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు బహిరంగ ప్రదేశాల్లో తిరగకుండా, సాధ్యమైనంత మేరకు ఇంట్లోనే ఉండాలన్నారు. అత్యవసర పనుల నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వచ్చేవారు కాటన్, తెల్ల రంగు దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేట్ కాకుండా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని, ముఖ్యంగా మజ్జిగ, నిమ్మరసం, సరిపడ మంచినీరు తాగాలన్నారు. తలతిరగడం, వాంతులు, 103 డిగ్రీలకు మించిన జ్వరం ఉంటే వడదెబ్బ తగిలినట్లుగా గుర్తించి, తక్షణమే వారిని నీడకు ప్రదేశానికి తరలించాలన్నారు. బట్టలు వదులు చేసి ఫ్యాన్ కింద కూర్చోబెట్టాలని చెప్పారు. ఏసీలో ఉంచి చికిత్స చేయడం ఉత్తమమని పేర్కొన్నారు. బాధితుడి పరిస్థితి తీవ్రంగా ఉంటే ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వడదెబ్బ, డయేరియాపై డీఎంహెచ్ఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన ఇండియన్‌స్ప్రింగ్స్ విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులను ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు అభినందించారు. విద్యానగర్‌లోని పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తిలక్‌బాబు మాట్లాడుతూ పరీక్షలు రాసిన 101 మంది విద్యార్థుల్లో 94 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. అప్పికట్ల నాగసాయి శ్రీనివాస్ అత్యధికంగా 587, మోహన లక్ష్మీప్రియ 586, షేక్ బుష్రా అంజుమ్ 584, పి.లక్ష్మీ ప్రత్యూష 578, షేక్ మల్లికా కౌసర్ 578, వెంకట దుర్గా వైష్ణవి 578, అతిక ఇష్రాత్ 576, అంగిరేకుల కుశల్ 576 మార్కులు సాధించారని పేర్కొన్నారు. పాఠశాలస్థాయిలో వేసిన పటిష్టమైన పునాదితో విద్యార్థులు ప్రతిభావంతులుగా నిలిచారని అన్నారు. ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థులు, వారితల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

12 మంది జూదరుల అరెస్ట్..

తాడికొండ: తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని నివాసంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు.పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ అనురాధ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు.

శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం అంజయ్య, ప్రిన్సిపాల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన శ్రీచైతన్య స్కూల్స్ విద్యార్థులను సంస్థ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య అభినందించారు. బుధవారం రింగ్ రోడ్డులోని కార్యాలయంలో విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. అంజయ్య మాట్లాడుతూ లక్ష్మీపురం క్యాంపస్ నుంచి కె.సిద్ధార్థ 590, శ్యామలానగర్ క్యాంపస్ నుంచి పి.గీతాంజలి 588, అఫ్జల్ 587 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.వినీత, కె.అరుణ, కో-ఆర్డినేటర్ ఏఎస్ఎన్ మూర్తి, డీన్లు హరిబాబు, శివప్రసాద్, ఏఓ టి.శ్రీనివాస్, ఏఓ డి.శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని కులం పేరుతో దూషించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బోరుగడ్డ అనిల్‌కుమార్ కారు డ్రైవర్ లాం గిరిబాబు బుధవారం అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను కారులో ఎక్కించుకుని డొంక రోడ్డు సమీపంలోని ఓ ఆసుపత్రికి వెళ్లాడు. కారు పార్కింగ్ విషయంలో గిరిబాబు మరో వ్యక్తి మధుబాబుతో గొడపడ్డాడు. మధు, గిరిబాబుతో పాటు యజమాని బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను కులం పేరుతో దూషించాడు. అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తాడికొండ: తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని నివాసంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. బత్తుల కోటేశ్వరరావుకు చెందిన నివాసంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ అనురాధ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. రూ. 29,300లు నగదు, 12 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ షేక్ సుభాని తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడకు చెందిన విద్యార్థి కనిపించడం లేదంటూ విద్యార్థి బాబాయి బుధవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. గుండిమెడకు చెందిన కాట్రగడ్డ యశ్వంత్ గుండిమెడలో ఉన్న హాస్టల్‌లో ఉంటున్నాడు. నెల 20న హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, కుటుంబ సభ్యులు, బాబాయి మహేంద్ర చుట్టుపక్కల విచారించి, బంధువులను అడిగినా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా యశ్వంత్‌ను గుర్తుపడితే 86888 31355, 92912 82666, 86865 53666 నంబర్లకు తెలియజేయలని ఎస్ఐ రమేష్ కోరారు.

బడుగు బలహీన వర్గాల బలసారథిని



ప్రత్తిపాడులో రైతుల ట్రాక్టర్ల ర్యాలీ



నామినేషన్‌లో యువత ద్విచక్ర వాహనాల భారీ ర్యాలీ

వైఎస్సార్ సీపీకి ప్రత్తిపాడులో ప్రజాబలం మరింత పుంజుకుంది. ఆ పార్టీ నియోజకవరఅభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ బడుగుల బలమై..బుధవారం నామినేషన్‌కు తరలివెళ్లారు. బండెనక బండికట్టి.. మీ వెంట మేము న్నామంటూ ప్రజలు ఆయన వెంట సాగారు. భానుడి భగభగను లెక్కచేయక.. బలహీనవర్గాల ఆశల కిరణమై ముందుకు సాగారు. వెంట గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య వచ్చారు.

– ప్రత్తిపాడు